క్లుప్తంగా

హరితహారం మొక్కలను సంరక్షించాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కొడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో హరితహారం మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం కొడిపల్లిలోని కొత్తచెరువుతండాలో రోడ్డు పక్కన నాటిన హరితహారం మొక్కలను పరిశీలించారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో శనివారం తెలంగాణ సాంస్కృతిక మండలి కళాకారుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక మండలి కళాకారులు కనకయ్య, కృష్ణ, సిద్ధులు ప్రభుత్వ పథకాలపై ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవి, పంచాయతీ కార్యదర్శి స్వాతిప్రియ, బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



పూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): మండలంలోని చిట్టోజీపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు శనివారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవళిక, మాజీ సర్పంచ్‌లు బాల్‌చందర్, రఘువీర్, మాజీ ఎంపీపీ కర్ణ పాండు, బీజేపీ నాయకులు గోవింద్, చందూ, భాను, సాయిచంద్, భజరంగ్‌దళ్ నాయకులు రాజు, శ్రీకాంత్, ఎల్లం, సతీష్ పాల్గొన్నారు.

కంప్యూటర్ల అందజేత



కంప్యూటర్లు అందిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పిల్లుట్ల ప్రాథమిక పాఠశాలకు కూకట్‌పల్లికి చెందిన దాత శైలేందర్‌గుప్తా రెండు కంప్యూటర్లను శనివారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలకు మౌళిక వసతుల కల్పన కోసం దాతల సహాయం మరిచిపోలేనిదని సర్పంచ్ రవి అన్నారు. అనంతరం దాతను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివశంకర్, పాఠశాల చైర్మన్ మధు, తదితరులు ఉన్నారు.

కళాశాలలో పాటల పోటీలు



అధ్యాపకులతో విద్యార్థినులు

నర్సాపూర్‌రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నర్సాపూర్ పెద్ద చింతకుంటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు పాటల పోటీలు నిర్వహించారు. మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో ఐసీడీఎస్ నర్సాపూర్ వారితో పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ దామోదర్ మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధి పనులు చేయకుండా ఇబ్బందులకు గురిచేయడంతో కూలీలు ఆందోళన చేశారు. ఈ సంఘటన మండలంలోని బోజ్యా గ్రామ పంచాయతీలో చోటు చేసుకుంది. తండాకు చెందిన కూలీలు చెండి గ్రామ శివారులో ఉన్న చెరువు శిఖం భూములో మట్టి తవ్వకాల పనులు నిర్వహిస్తున్నారు. శిఖం భూమిలో పనులు చేయొద్దంటూ సమీప రైతు పనులు నిర్వహించే భూమిలో నీరు వదిలారు. దీంతో శనివారం కూలీలు పనులు నిర్వహించకుండా నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి పనులకు అడ్డంకులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కూలీలు డిమాండ్ చేశారు. చెరువు శిఖం భూములు కబ్జా చేయాలనే సంకల్పంతో పలువురు వ్యక్తులు ఉపాధి పనులు జరగకుండా చేస్తున్నారని సర్పంచ్ రాజునాయక్ ఆరోపించారు.

పరీక్షలయ్యే వరకు టీవీ, సెల్‌ఫోన్ వద్దు

పది, ఇంటర్ విద్యార్థులకు డైట్ ప్రిన్స్‌పాల్ రమేశ్‌బాబు అవగాహన



హాజరైన విద్యార్థులు

మెదక్‌జోన్: అతను ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చి సుమారు మూడు దశాబ్దాలు పూర్తి చేసుకున్నారు. ఆయన ప్రస్తుతం డైట్ ప్రిన్స్‌పాల్‌గా విధులు నిర్వర్తిస్తూనే మంచి సైకాలజిస్ట్‌గా రాణిస్తున్నారు. అతనే డైట్‌ప్రిన్స్‌పాల్ రమేశ్‌బాబు. ప్రస్తుతం ఇంటర్, పదవ తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో పరీక్షలకు ఎలా సిద్ధం కావాలనే అంశంతో పాటు ఉపాధ్యాయుల పాత్రపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

- పదో తరగతి, ఇంటర్ పరీక్షలు షెడ్యూల్ రావటంతో విద్యార్థులు పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి, ఏ ఆహారం తీసుకోవాలనే అంశాలపై డైట్‌ప్రిన్స్‌పాల్ రమేశ్‌బాబు అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నారు.
- ఈనెల 2న, డైట్ కళాశాలలో పది, ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈనెలలో సుమారు 10 సదస్సుల వరకు నిర్వహించాలని ఆయన షెడ్యూల్ ప్లాన్ చేశారు.
- ఈ అవగాహన సదస్సులు తమ పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు పోటీ పడుతున్నారు.
- పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 11 వరకు పరీక్షలు జరుగనున్నాయి. జిల్లాలో సుమారు 7 వేల మంది విద్యార్థులు ఉన్నారు.
- అలాగే ఇంటర్ విద్యార్థులు ఫస్టియర్, సెకండియర్ మొత్తం 13,216 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 1 వరకు పరీక్షలు జరుగనున్నాయి.
- పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలా సన్నద్ధమైతే ఉత్తమ ఫలితాలు సాధిస్తారనే అంశంపై డైట్ ప్రిన్స్‌పాల్, సైకాలజిస్టు, రమేశ్‌బాబు విద్యార్థులకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలు పూర్తయ్యే వరకు కొన్ని అలవాట్లను తాత్కాలికంగా దూరం పెట్టాలంటారు.
- సెల్ వాడకాన్ని మానుకోవాలి, టీవీలను కట్టి అటుకుపైన వేయాలి, నేటి యువత క్రికెట్, సినిమాలు చూడటం మానేయాలంటున్నారు.
- మనం ఎంచుకున్న లక్ష్యం చేరాలంటే ఆ దిశగా నిరంతరం ఇష్టంతో శ్రమిస్తుండాలి.
- ఉపాధ్యాయుడు చెప్పిన పాఠాన్ని వెంటనే నేర్చుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లో వాయిదావేయటం సరికాదని వివరిస్తారు.



మాట్లాడుతున్న రమేశ్‌బాబు (ఫైల్)

ఉపాధ్యాయ వృత్తి గొప్పవరం

ఉపాధ్యాయ వృత్తి గొప్పవరం లాంటిది. నా దగ్గర చదువుకున్న వారు, నా స్పీచ్ విని మోటివేషన్ అయిన వారు ఎంతో మంది ఉన్నత స్థాయిలో ఉన్నారు.

–రమేశ్‌బాబు, సైకాలజిస్ట్

చాకరిమెట్లలో భక్తుల పూజలు



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. దాతల సహాయంతో నిర్వాహకులు అన్నదానం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ తదితరులు ఉన్నారు.

ఐఈఎస్, ఐఎస్ఎస్ శిక్షణ అధికారుల పర్యటన



శిక్షణ అధికారులను సన్మానిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని ఎదుల్లాపూర్ గ్రామంలో ఐఈఎస్, ఐఎస్ఎస్ శిక్షణ అధికారులు పర్యటించారు. ఫౌండేషన్ శిక్షణలో భాగంగా నేటి నుంచి 10 వరకు ఐదుగురు ఐఈఎస్, ఐఎస్ఎస్ శిక్షణ అధికారులు గ్రామంలో ఉంటారని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలు, వివిధ అంశాలపై చర్చించనున్నారని, శిక్షణ అధికారులను ఎంపీపీ హరికృష్ణ, సర్పంచ్ కీర్తన సన్మానించారు. శిక్షణ అధికారులు గ్రామంలో ఉండేందుకు ఏర్పాట్లు చేశామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిరుపతిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ అనీల్‌కుమార్, కార్యదర్శి రాఘవేంద్రచారి, సునందరెడ్డి తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

పెద్దశంకరంపేట(మెదక్): శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు అల్లాదుర్గం సీఐ జార్జ్ తెలిపారు. శనివారం కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగంగా మక్త లక్ష్మాపూర్‌లో అల్లాదుర్గం సీఐ జార్జ్ ఆధ్వర్యంలో టేక్మాల్, రేగోడ్, అల్లాదుర్గం, పేట మండలాలకు చెందిన ఎస్ఐలు, 43 మంది పోలీసులతో ఆకస్మికంగా కమ్యూనిటీ కనెక్ట్ పోగ్రాంలో భాగంగా 200 ఇళ్లను తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సరైన ధృవపత్రాలు లేని 17 బైక్‌లు, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు బాలరాజు, సత్యనారాయణ, లింగం, ప్రవీణ్ తదితరులున్నారు.

‘బీఆర్ఎస్‌లో చేరనందుకే అనర్హత వేటు’

నర్సాపూర్: పట్టణ ఎంపీపీ జ్యోతి బీఆర్ఎస్‌లో చేరనందుకే ఆ పార్టీ ముఖ్య నాయకులు అనర్హత వేటు వేయించారని కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకులు దేవిసింగ్, నరేష్‌జాదవ్, ప్రసాద్, శ్రీనివాస్, సాలి, సుజాత, అమ్రునాయక్ తదితరులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ... బీఆర్ఎస్‌కు చెందిన కొందరు ముఖ్య నాయకులు జ్యోతిని బీఆర్ఎస్‌లో చేరాలని పలుమార్లు ఆహ్వానించినా.. ఆమె బీఆర్ఎస్‌లో చేరనందుకే ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పలువురు నాయకులు అధికారులపై ఒత్తిడి చేసి, ఆమెపై అనర్హత వేటు వేయించారని ఆరోపించారు.

బొమ్మలతో అర్థమయ్యేలా బోధించాలి



బోధన తీరును పరిశీలిస్తున్న నోడల్ అధికారి

టేక్మాల్(మెదక్): ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి శివకుమార్ తెలిపారు. శనివారం మండలంలోని చెరువుముందని తండా, సూరంపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. తరగతి గదుల్లోని విద్యార్థుల సామర్థ్యాలను, పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు చదవడం, రాయడంపై పట్టు సాధించేలా చూడాలన్నారు. బొమ్మలతో, చార్టులతో బోధన చేపడితే విద్యార్థులు ఎప్పటికీ మరిచిపోలేరని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న తొలిమెట్టుతో విద్యార్థుల్లో సత్ఫలితాలు కనిపించాలన్నారు. అన్ని పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తిన పై అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇందులో ఆర్‌పీలు కృష్ణ, టీచర్‌లు భవాని, మనోహర్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల తనిఖీ



మాట్లాడుతున్న ఎంఈఓ బుచ్చానాయక్

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఇన్‌చార్జ్ ఎంఈఓ బుచ్చానాయక్ తనిఖీ చేశారు. శనివారం మండల పరిధిలోని బుజ్రాన్‌పల్లి, టెంకటి, జంబికుంట, చీలాపల్లి పాఠశాలల్లో మన ఊరు – మనబడి పనులతో పాటు మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రామచంద్రాచారి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిలప్‌చెడ్, చండూర్, చిట్కుల్ ఉన్నత పాఠశాలలను మండల ప్రత్యేకాధికారి డీఆర్‌డీఓ ఏపీడీ భీమయ్య శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వాహణను, సాయంత్రం స్నాక్స్ అందుతున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యాం కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు సీఎంఓ పర్యటన



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీపీ

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలోని పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించేందుకు సీఎం కార్యాలయ ప్రధాన కార్యదర్శి సింగాయపల్లి నర్సింగరావు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వస్తున్నారని ఎంపీపీ హరికృష్ణ తెలిపారు. శనివారం పాఠశాలలో వివిధ శాఖల సిబ్బందితో మన ఊరు – మన బడి, సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న పనులపై ఎంపీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. నర్సింగరావు ఇదే పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగిన విషయం గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమణినరేందర్, ఉప సర్పంచ్ భిక్షపతిరావు, హెచ్‌ఎం హిమబిందు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నియామకం**

తూప్రాన్: పట్టణ సమీపంలోని శ్రీకూర్మం నరసింహస్వామి దేవాలయ ఉత్సవ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా మామిండ్ల కృష్ణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా కంటాయిపాలెం వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా కృష్ణయ్య, రవీందర్, తిమ్మాపురం నరసింలు, అహోబిలం హరిప్రసాద్, కోశాధికారిగా శ్రీమూర్థం విద్యాసాగర్, కమిటీ సభ్యులుగా నారాయణగుప్తా, రవీందర్ గుప్తా, డాక్టర్ ప్రదీప్ సింహ, పేర్ల మధుసూదన్, విఠల్, రమేశ్‌గుప్తా, నరేందర్, గడప దేవేందర్, ఆర్.శ్రీశైలంగౌడ్, వెంకటేశం, పోచందర్, కార్యదర్శులుగా నాగేశ్, మహేశ్, అనిల్, నాగులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ **ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం**

చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. చేగుంట మండలంలోని పలు పాఠశాలల్లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తరపున బరిలో ఉన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేగుంట ఉన్నత పాఠశాలలో మాట్లాడుతూ .. ప్రత్యేక రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటే తపస్ సంఘం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సమావేశంలో తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, సంఘ బాధ్యులు ప్రభాకర్, వేణు, నర్సింలు, నాగిరెడ్డి, వెంకటేశం, ఆంజనేయులు, రమేశ్, రాజేశ్వర్, మాధవి, భానుచందర్ పాల్గొన్నారు.

◆ **పాఠశాలలో సైన్స్ ఫెయిర్**

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్ర ఉన్నత పాఠశాల్లో శనివారం సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంఈఓ యాదగిరి, సర్పంచ్ మహిపాల్‌రెడ్డితో కలిసి పలు నమూనాలను తిలకించారు. వీరి వెంట హెచ్‌ఎం వెంకటస్వామి తదితరులున్నారు.

◆ **ఆహ్వానం**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని అంతారంలో నూతనంగా నిర్మించే భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణ భూమి పూజకు రావాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్‌కు గ్రామ ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను శనివారం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నర్సింహచారి, రాజు, గాజుల దుర్గేష్, కొమురయ్య, రవీందర్, సునీల్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రమాదాలు జరగకుండా చూడాలి**

నర్సాపూర్: ప్రభుత్వ గురుకులాలు పాఠశాలల్లో ప్రమాదాలు జరుగకుండా చూడాలని ఏబీవీపీ నర్సాపూర్ డివిజన్ జాయింట్ సెక్రెటరీ అక్షయ్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని నారాయణపూర్‌లోని తెలంగాణ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో వంట గ్యాస్ సిలిండర్ పేలిన విషయంపై ఆయన స్పందించారు. తాను పలువురు ఏబీవీపీ కార్యకర్తలతో గురుకుల పాఠశాలకు వెళ్లి ప్రమాదం జరిగిన వంటశాలలో పరిశీలించి వచ్చినట్లు ఆయన చెప్పారు.

◆ **చదువుతోనే ఉజ్వల భవిష్యత్**

శివ్వంపేట(నర్సాపూర్) సమాజంలో చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్ఐ రవికాంత్ రావు, బేతాని అనాథశ్రమం వ్యవస్థాపక అధ్యక్షుడు జోసఫ్ సజీవ్ వర్గీస్ అన్నారు. మండలంలోని మగ్దుంపూర్ గ్రామంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రినిపాల్ సీనా, పావని, వీరాబాబు, విల్సన్ తదితరులు ఉన్నారు.

◆ **హైవే పక్కన ప్లాస్టిక్ సేకరణ**

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని 765డీ జాతీయ రహదారి పక్కన ప్లాస్టిక్‌తో పాటు ఇతర వ్యర్థాలను గ్రామ పంచాయతీ కార్మికులు సేకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా గ్రామ పంచాయతీ కార్మికులు శనివారం చెత్తను సేకరించారని చెప్పారు.

◆ **పని కల్పించాలి**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్నఘనాపూర్ శివారులోని ఐఎంఎల్ (ఇండియన్ మేడ్ లిక్కర్)డిపోలో హమాలీ పని కల్పించాలంటూ అక్కడి నిరుద్యోగులు చేపట్టిన నిరాహార దీక్ష శనివారం కొనసాగింది. సంబంధిత అధికారులు స్పందించి పని కల్పించాలని కోరారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేయాలి



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్

నర్సాపూర్: పట్టణంలో పారిశుధ్య పనులు సక్రమంగా చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ సిబ్బందికి సూచించారు. శనివారం ఉదయం ఆయన పట్టణంలోని పలు వీధుల్లో, పట్టణ పరిధిలో ఉన్న జాతీయ రహదారి వెంట పర్యటించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పారిశుధ్య పనులు అన్ని వార్డుల్లో నిర్ణయించిన మేరకు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని చెప్పారు. హరితహారం కింద నాటిన మొక్కలను రక్షించేందుకు సైతం తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ వివరించారు. ఆయన వెంట మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళీ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రంలో సకల సదుపాయాలు



టేక్మాల్(మెదక్): గర్భిణులకు కార్డులను అందిస్తున్న దృశ్యం



అల్లాదుర్గం(మెదక్): గర్భిణులకు ఏఎన్‌సీ కార్డులు అందిస్తున్న డాక్టర్



శివ్వంపేట(నర్సాపూర్): మందుల కిట్‌ను అందిస్తున్న ఎంపీపీ

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులు, రోగులకు సకల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని గడిపెద్దాపూర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఏఎన్‌సీ కార్డు, బీపీ, షుగర్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రాల్లో డెలివరీ అయితే కేసీఆర్ కిట్‌లు, రూ.12 వేలు నగదు ఇస్తారని తెలిపారు. గర్భిణులకు ప్రతీ నెల పరీక్షలు చేయడంతో పాటు వారికి ఇంజక్షన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. బీపీ, షుగర్ పరీక్షలు చేయడంతో పాటు వారికి అవసరమైన మందులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విఠల్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): గర్భిణులు, బాలింతలు సమయానికి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఎంపీపీ చింత స్వప్న అన్నారు. శనివారం మండల కేంద్రం టేక్మాల్‌లోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో గర్భిణులకు ఏఎన్‌సీ కార్డును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయికోటి సుప్రజాభాస్కర్, ఎంపీడీఓ భారతి, వైద్యురాలు డాక్టర్ కృతిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్ రోగులకు మందుల కిట్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల నుంచి గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ ఇచ్చే పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయనిర్మల అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యురాలు సంధ్య, ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ జీవన్ ఉన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని శేరితండాలో వైద్యసిబ్బంది గర్భిణులకు మెడికల్ రిపోర్ట్ గుర్తింపు కార్డులను అందజేశారు. ఏఎన్ఎం రాజమణి, అంగన్‌వాడీ టీచర్ ఇందిర ఆధ్వర్యంలో తండాలోని గర్భిణులకు వైద్యచికిత్సలకు సంబంధించి నమోదు చేసిన కార్డులను పంపిణీ చేశారు. ఉపాధ్యాయురాలు స్వప్న తండావాసులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి

పెద్దశంకరంపేట సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంపీపీ

పెద్దశంకరంపేట(మెదక్): అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. శనివారం పేటలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విద్యుత్ శాఖ అధికారుల తీరుపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించడంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మండలంలో మన ఊరు–మనబడి పనులను వేగవంతం చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అనేక సౌకర్యాలను కల్పిస్తున్నా. నిర్వాహణలో బాధ్యతగా వ్యవహరించడం లేదని వాపోయారు. ఈ నెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపీపీ సూచించారు. సర్పంచ్ అనంతరావు మాట్లాడుతూ.. కొత్తపేటలో వాటర్‌ట్యాంకుకు కనెక్షన్ ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ముసాపేట సబ్‌సెంటర్‌లో సిబ్బందిని నియమించాలని సర్పంచ్ అంజిరెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఫిఖ్ ఉన్నీసా, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, ఎంపీటీసీలు దత్తు, స్వప్న, కోఆప్షన్ యాదుల్, సర్పంచ్‌లు కుంట్ల రాములు, ప్రకాష్, పార్వతీ, సుధాకర్, ఇన్‌చార్జ్ ఎంఈఓ బుచ్చానాయక్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం పాఠశాలను పట్టించుకోవడం లేదు

చేగుంట సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ స్వర్ణలత



మాట్లాడుతున్న ఎంపీపీ మాసుల శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): తమ గ్రామంలోని ఉన్నత పాఠశాల అభివృద్ధికి హెచ్‌ఎం బాలచంద్రం సహకరించడం లేదని సర్పంచ్ స్వర్ణలత ఆరోపించారు. ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చందాయిపేట సర్పంచ్ స్వర్ణలత పాఠశాలలోని సమస్యలను సభలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. చందాయిపేట, చిట్టోజిపల్లి గ్రామాల్లో మిషన్ భగీరథనీరు సక్రమంగా రావడం లేదని, వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సరఫరా సక్రమంగా చేయాలని సభ్యులు కోరారు. మక్కరాజీపేట సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని అధికారులను కోరారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సర్వసభ్య సమావేశంలో పాల్గొని గ్రామాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఎంపీపీ మాసుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండల పరిషత్ నిధులను వినియోగించుకొని ఆయా గ్రామాల ఎంపీటీసీలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకోవాలని సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణబాబు, ఎంపీఓ సతీశ్, వైస్ చైర్మన్ రాంచంద్రం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వయంపాలన దినోత్సవం



తూప్రాన్: ఉపాధ్యాయులతో విద్యార్థులు



నర్సాపూర్ రూరల్: నత్నయపల్లిలో..



చేగుంట ఉన్నత పాఠశాలలో..



రామాయంపేట(మెదక్): పట్టణంలో..

తూప్రాన్: మండలంలోని వెంకటాయిపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు బోధన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం జరుపుకున్నారు.

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని వివేకానంద విద్యాలయంలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నయపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శనివారం స్వయంపాలన దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు కిష్టయ్య, నాగరాజు బహుమతులు అందించారు.